# వన మహోత్సవం

నా కోరిక చిన్నదే. కట్టుకున్న ఇంటి పెరటిలో కాస్త ఖాళీ జాగా ఉంది. అందులో ఒక నీడనిచ్చే చెట్టు వేసుకుని ఆ నీడలో నారిటైర్డ్ జీవితం ప్రశాంతంగా గడపాలని. అయితే వేప మొక్కో మరేదో మొక్కో వేసుకోక లేత మామిడి మొక్క పాతడం నే చేసిన పెద్ద పొరపాటు.

దీనితో మొదలైంది నాకూ నాచుట్టూ ప్రపంచానికీ ఘర్షణ. ఇల్లుకట్టి అలసి కాంపౌండుగోడ కట్టలేక ముళ్ళకంచెవేశాను. దానిని తొలిగించి ఎదురింటి వాళ్ళ బర్రె గజనీ మహమ్మదులా అప్పుడప్పుడూ దండెత్తి నా మొక్క లెక్కగా వేసిన చిగురుటాకుల్ని తమలపాకుల్లా నమిలిపోతూ ఉండేది. ఎదురింటాయనతో చెప్పిచూశాను. 'గొడ్డుకేమి తెలుస్తుందండీ పాపం-గోడకట్టుకోవాలి కానీ' అన్నాడు సౌమ్యంగా. నా బాలరసాలం చిక్కి చావసిద్ధంగా ఉంటే చూడలేక అప్పుచేసి గోడకట్టుకున్నాను. మరుసటి వసంతానికి కొన్ని రెమ్మలు తొడిగి కంటికి ఇంపుగా కనుపించింది. పశువులబాధ పూర్తిగా పోయినందుకు తృప్తిగా ఎక్కడికి వెళ్ళి ఇంటికి తిరిగివచ్చినా ఓమారు మామిడి మొక్కను చూసుకుంటూ ఉంటే మనుష్యులతో పేచీ ప్రారంభమైంది మెల్లగా. వరలక్ష్మీవ్రతం అనీ వినాయకచవితి అనీ, అడపాదడపా వచ్చే పర్వ దినాలకే కాక సత్యనారాయణవ్రతం అనీ, గృహప్రవేశమనీ రెండంటే

రెండు ఆకులని అడిగి కనీసం రెండుకొమ్మలు తుంచి వెళ్ళిపోయేవారు. నాకు పరిచయమైన వాళ్ళు కొందరు, నా భార్యకు తెలిసినవారు కొందరు ప్రక్కవీధిలో ఉంటున్న హక్కుచేత కొందరు. ఏ పరిచయమూ లేకున్నా గోడమీదకు ఎదిగి రెండు కొమ్మలు ఇతరులకు కనిపించిన నేరానికి కొందరూ ఆ కోలుకుంటున్న మొక్కను హింసించేవారు. మొదట్లో నేను ముఖమాటపడి ఉపేక్షించినా దినదినం దిగజారిపోతున్న మొక్క పరిస్థితిచూసి రానురానూ నిష్ఠూరంగా ఇవ్వలేనంటూ వాళ్ళ అభ్యర్థన త్రోసిపుచ్చడం ప్రారంభించాను.

ఇంక నేనొక సంఘవిద్రోహకశక్తినై పోయాను. 'శుభమా అని రెండు ఆకులడుగుతే లేవని అనడానికి నోరెట్ల వస్తుందో' అని నాకువిని పించేటట్టు గొణుక్కుంటూపోయేవారు. మొక్క క్రమంగా నిలదొక్కుకొని పెరిగింది కానీ నేను ఎవ్వరికీ కానివాడినై పోయాను నెల నెలా మామి డాకుతో పనిపడే ఏకుటుంబీకుడూ ఒక మొక్కను ఇంటిలో వేసుకోలేదు కానీ గొప్పొదమంత జాగాఉంటే ఒక చిన్న కొట్టుగదిలాంటిదికట్టి అద్దెకు ఇస్తూనే ఉన్నాడు.

ఒక బంధువు ఇంటిలో పెండ్లి జరుగుతే ఇంటికి తాళంవేసి మేమంతా వెళ్ళవలసివచ్చింది. సాయంత్రం ఇంటికి వస్తూనే అలవాటు ప్రకారం నా దృష్టి మామిడిమొక్క మీదికి పోయింది. గుండె ఆగినంత పనిఅయింది. కొమ్మలూ, రెమ్మలూ తెగి కళకళలాడే మొక్క అకాలంలో శిశిరం వచ్చినట్లు విషాదంగా నన్నుచూసి విలపించింది. కాస్త దూరంగా చెవులు పగిలేటట్టు మైక్ సినిమాపాట పాడుతోంది. అటుగా పోయి చూశాను. అనుకోకుండా అప్పటికప్పుడు ఏర్పరచిన కార్యక్రమంలా ఉంది. మామిడాకుల తోరణాల వేదిక మీద గంభీరంగా నిలబడిన వక్త కంఠం సవరించుకుంటున్నాడు. సినిమా రికార్డు సంగీతం తప్పదన్నట్లు ఆగింది. "అనేక కార్యక్రమాలు చేపట్టవలసిఉందనీ అందులో చెట్లునాటడం ఒకట"నీ అంటున్నాడు. సభ నేర్పాటుచేసిన పెద్దలూ, యువకులూ, అభిమానులూ చప్పట్లు కొడుతున్నారు.

— రంజని మాస పత్రిక నవంబర్-డిశంబర్ 1982